సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం | 31 | జూలై | 2025



సహనానికి పరీక్ష

పదో తరగతి అనేది విద్యార్థులకు అత్యంత కీలకమైన దశ. అయితే పబ్లిక్ పరీక్షలు తెలుగు, ఇంగ్లిష మీడియాల్లో రాసుకోవచ్చా అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.

8 లో



మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 5,14,117 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు.

మందుబాబుల జేబు గుల్ల



కూటమి ప్రభుత్వంలో మందుబాబులను అడ్డంగా దోచుకుంటున్నారు. మద్యం ధరలు తగ్గించినా ఆ విషయాన్ని దాచిపెట్టి మందుబాబుల జేబులు గుల్లచేస్తున్నారు. చాగల్లు కేంద్రంగా పలు మండలాల్లోని మద్యం దుకాణాల్లో ఈ దందా జరుగుతోంది.

8 లో

న్యూస్‌రీల్

సబ్ జైళ్ల దుస్థితిపై శాసన మండలిలో ప్రశ్నిస్తా



కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ

అమలాపురం టౌన్: రాష్ట్రంలోని సబ్ జైళ్ల దుస్థితిపై శాసన మండలిలో ప్రశ్నిస్తానని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తెలిపారు. అమలాపురం హైస్కూలు రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన బుధవారం 'సాక్షి'తో మాట్లాడారు. ఆగస్టులో జరిగే శాసన మండలి సమావేశాల్లో సబ్ జైళ్ల సమస్యలపై తాను అడిగేందుకు వీలుగా దీనికి సంబంధించిన ప్రశ్నను మండలి కార్యాలయ అధికారులకు బుధవారం పంపించానని చెప్పారు. అమలాపురం, రాజోలు, ముమ్మిడివరాల్లోని బ్రిటీషు కాలంలో రాళ్లతో నిర్మించిన పటిష్టమైన కట్టడాలతో ఉన్న సబ్ జైళ్లను ఆధునీకరణ పేరుతో వాటి సేవలను గత టీడీపీ ప్రభుత్వం నిలిపేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ మూడు పూర్వపు తాలూకా ప్రదేశాల్లో సబ్ జైళ్లు అందుబాటులో లేకపోవడం వల్ల నిందితులను పోలీస్ ఎస్కార్ట్‌తో వ్యయ ప్రయాసలకోర్చి కొత్తపేట లేదా రాజమహేంద్రవరం సెంట్రల్ జైళ్లకు పంపించాల్సి వస్తోందన్నారు. దీనివల్ల పోలీసుల ఎస్కార్ట్, కేసు పూర్వ పరాల కోసం నిందితులున్న జైళ్లకు వెళ్లే న్యాయవాదులు, నిందితుల కుటుంబ సభ్యులు ములాఖత్‌లు కోరేందుకు ఎంతో వ్యయం, సమయం వృథా అవుతోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆధునీకరణ పేరుతో అమలాపురం సబ్ జైలు మూసివేసిన దుస్థితిపై 'సాక్షి'లో సోమవారం వచ్చిన కథనం ఆధారంగా మిగతా జైళ్ల దుస్థితిపై శాసన మండలిలో ప్రశ్నించనున్నట్లు ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తెలిపారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్

అమలాపురం టౌన్: రాష్ట్రంలో మహిళలకు ముఖ్యంగా బాలికలకు రక్షణ లేకుండా పోతోందని, అసలు లా అండ్ ఆర్డర్ అమలవుతుందా అనే సందేహం కలుగుతోందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ ప్రశ్నించారు. ప్రతి శాఖలోనూ వైఫల్యాలతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వ్యవస్థలపై పట్టు కోల్పోతోందన్నారు. అమలాపురంలోని అరిగెలపాలెంలో బుధవారం జరిగిన ఆర్‌పీఐ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయవరం మండలం మాచవరంలోని ఓ ప్రైవేటు స్కూల్లో బాలికపై ఆ స్కూలు కరస్పాండెంట్ లైంగిక దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వరస వైఫల్యాలను చూస్తుంటే ఇది మాటల ప్రభుత్వమే కానీ, చేతల ప్రభుత్వం కాదని తేటతెల్లమవుతోందన్నారు. ఆర్‌పీఐ నాయకుడు ఉండ్రు శ్యామలరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాండ్రేగుల పాఠశాలలో అదనపు జిల్లా జడ్జి విచారణ

జగ్గంపేట: మండలంలోని కాండ్రేగుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 7వ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి జి.చంద్రమౌళీశ్వరి విచారణ నిర్వహించారు. ఈ నెల 17వ తేదీన పాఠశాలలో ఏడుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురి కావడం, వారికి ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులలో చికిత్స అందించిన సంగతి తెలిసిందే. దీనిపై జిల్లా జడ్జి విచారణకు వచ్చి అస్వస్థతకు గురయిన విద్యార్థినులతోను, వైద్యం అందించిన డాక్టర్లతోనూ, విద్యార్థినులు తల్లిదండ్రులతో ఆరోజు జరిగిన ఘటన గురించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ అనంతరం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. .

నవోదయ దరఖాస్తులకు 13 వరకూ గడువు

పెద్దాపురం: 2026–27వ ఏడాది పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయలో ఆరవ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఆగస్టు 13వ తేదీ వరకుపొడిగించినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత విద్యా సంవత్సరం 2025–26లో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు.

మొక్కుబడి ప్రవేశాలు

- తూతూమంత్రంగా ఆర్‌టీఈ అడ్మిషన్లు
- చట్టం ఆదేశాలు పట్టించుకోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు
- సీట్ల కేటాయింపునకు సాకులు
- ఇచ్చినా అదనపు వసూళ్లు
- పేద విద్యార్థుల తల్లిదండ్రుల అవస్థలు



ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

సాక్షి, అమలాపురం: కూటమి పాలనలో విద్యాహక్కు చట్టాలు కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలకు చుట్టాలుగా మారిపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులకు 25 శాతం ఉచితంగా సీట్లు ఇవ్వాలని చేసిన నిబంధనను ప్రైవేట్ సంస్థలు అపహాస్యం చేస్తున్నాయి. 2025–26 విద్యా సంవత్సరానికి ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం, అమలులో మాత్రం చిత్తశుద్ధి చూపించడం లేదు. ప్రభుత్వ ఆదేశాలు, విద్యాహక్కు చట్టం నిబంధనలను యాజమాన్యాలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా పట్టించుకునేవారే లేరు. నిబంధనలను పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వెనకడుగు వేయడం వెనుక ప్రభుత్వ పెద్దల అనధికార ఆదేశాలున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల అలసత్వం

విద్యాహక్కు చట్టం జిల్లాలో పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. దీని అమలుపై విద్యాశాఖ అధికారులు అలసత్వం వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లల్లో ఈ చట్టం కచ్చితంగా అమలు చేయాలి. స్కూళ్ల ప్రారంభించిన వెంటనే ఆర్టీఈ (విద్యాహక్కు చట్టం) కింద ఒకటో తరగతి అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆన్‌లైన్ లాటరీ విధానంలో విద్యార్థులకు పలు పాఠశాలల్లో ప్రవేశాలు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ప్రవేశాల పత్రాలను తల్లిదండ్రులు తీసుకెళ్లి ప్రైవేటు పాఠశాలల్లో ఇస్తుంటే అడ్మిషన్లు ఇచ్చేందుకు రకరకాల సాకులు చెబుతున్నారు.



రెండు విడతలు

జిల్లాలో రెండు విడతలుగా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేశారు. మొదటి విడతలో 815 మంది చిన్నారుల అడ్మిషన్లకు అర్హత జాబితాను ప్రకటించగా, 643 మంది వివిధ పాఠశాలల్లో చేరారు. రెండవ విడతలో 338 మంది అర్హత ఉన్న చిన్నారుల జాబితా ప్రకటించగా, 210 మంది ప్రవేశాలు పొందారు. మొత్తం 1,153 మందికి అడ్మిషన్లకు సీట్లు కేటాయించగా, 853 మంది అడ్మిషన్లు పొందారు. ఇంకా 300 మందికి అడ్మిషన్లు ఇవ్వాల్సి ఉంది.

ఆదేశాలు బేఖాతరు

విద్యా హక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా ప్రభుత్వమే ఆన్‌లైన్‌లో సీట్లు కేటాయిస్తుంది. దీనిని ఉల్లంఘిస్తే సుప్రీంకోర్టు ఆదేశాలను లెక్కచేయనట్లుగానే పరిగణించాలి. దీనిపై తీవ్రమైన చర్యలు తీసుకునే అవకాశం అధికారులకు ఉంటుంది. అవసరమైతే ఆ స్కూల్ అనుమతి రద్దు చేయడం జరుగుతుంది. అయితే పేదల సీట్ల విషయంలో అధికారులు ప్రైవేటు, కార్పొరేటు స్కూళ్లను బతిమలాడుకోవాల్సి వస్తోంది.

అదనంగా వసూలు

చట్టం ప్రకారం ఒకటో తరగతిలో ఉచితంగా ప్రవేశం కల్పిస్తే 8వ తరగతి వరకూ వెసులుబాటు ఉంటుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్టార్–1 రేటింగ్ ఉన్న పాఠశాలకు రూ.8,500, స్టార్–2 పాఠశాలలకు రూ.10 వేలు, స్టార్–3 పాఠశాలలకు రూ.11,500, స్టార్–4 పాఠశాలలకు రూ.13 వేలు, స్టార్–5 పాఠశాలలకు రూ.14,500లను ఫీజుగా ప్రభుత్వం చెల్లిస్తోంది. రెండు విడతలుగా (సెప్టెంబర్, జనవరి) అడ్మిషన్లు ఇచ్చిన పాఠశాలలకు ప్రత్యేక ఖాతాకు జమ చేస్తారు. ప్రభుత్వం నుంచి వస్తున్నదే కాకుండా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఇతర రకాలుగా అదనంగా సొమ్ము వసూలు చేస్తున్నాయి. దీనితో పూర్తి ఉచిత విద్య కాస్తా పాక్షిక ఉచిత విద్యగా మారిపోతోంది. బస్సు, పుస్తకాలు, యూనిఫాం, షూ, టై, బెల్టు, బిల్డింగ్ ఫండ్, స్పెషల్ ఫీజు ఇలా రకరకాల బాదుడు మామూలే. ఆ డబ్బులు ఆయా తల్లిదండ్రులు చెల్లించాల్సిందే. కేవలం ట్యూషన్ ఫీజులో మాత్రమే కొంత రాయితీ ఇస్తున్నట్టుగా మారింది. అడ్మిషన్ల అమలు ప్రక్రియ అంటేనే ప్రైవేట్ యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పక్కాగా అడ్మిషన్లు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆర్టీఈ అడ్మిషన్లను పక్కాగా అమలు చేశారు. పేదల నుంచి అదనపు ఫీజులు వసూలు చేయకుండా కట్టుదిట్టంగా వ్యవహరించారు. జిల్లాలో 2022–23లో 342 పాఠశాలలో 201 మందికి ప్రవేశాలకు గాను 150 మంది వరకు చేరారు. 2023–24లో ఏకంగా 1,793 మందికి 1,256 మంది, 2024–25లో 2,805 మందికి 1,501 మందికి మాత్రమే ప్రవేశాలు దక్కాయి. ఇంచుమించు సగం మందికి అంటే 1,304 మంది దూరంగా ఉన్నారు. ప్రస్తుత కూటమి సర్కారు ఆర్టీఈ ప్రవేశాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

సీట్లు రద్దు చేశారు



విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం సీట్లను అర్హులైన పేద, మధ్య తరగతి విద్యార్థులతో భర్తీ చేయాలి. అలా చేయకుంటే ప్రైవేట్ యాజమాన్యాలు విద్యాహక్కు చట్టాన్ని అవహేళన చేస్తున్నట్టే. ఈ చట్టాన్ని ప్రభుత్వం సక్రమంగా అమలు చేయాలి. కొన్ని పాఠశాలలకు సీట్లు కేటాయించగా వారికి తల్లికి వందనం వచ్చిందని చెప్పి సీట్లు రద్దు చేశారు. ఇది చాలా అన్యాయం.

– రేవు తిరుపతిరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

వ్యాధుల నియంత్రణలో పురోగతి సాధించాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

అమలాపురం రూరల్: హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ చర్యలకు సంబంధించి జిల్లా కొంచెం వెనుకబడి ఉందని, మెరుగైన పనితీరు కనబరుస్తూ వ్యాధుల నియంత్రణలో పురోగతిని సాధించాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పథక సంచాలకులు డాక్టర్ కె.నీలకంఠారెడ్డి అన్నారు. డీఆర్‌ఓ రాజకుమారి అధ్యక్షతన బుధవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలకంఠారెడ్డి మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ కౌన్సెలింగ్ పరీక్షా కేంద్రాల నిర్వహణ, సుఖ వ్యాధుల నివారణ, ఏరియా ఆసుపత్రులలో లైంగిక వ్యాధుల క్లినిక్‌లు, ఏఆర్టీ కేంద్రాల నిర్వహణను మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రతి నెలా ఎటువంటి లోపాలు లేకుండా ఉచితంగా మందులు పంపిణీ జరగాలన్నారు. డీఆర్వో రాజకుమారి మాట్లాడుతూ ఏఆర్టీ కేంద్రాల్లో జీవితకాలం మందులను ఉచితంగా అందిస్తారని, మందులు క్రమం తప్పకుండా వాడించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ప్రతి ఐసీటీసీ కేంద్రంలో హెచ్ఐవీ పరీక్షతో పాటు తగిన సూచనలు, సలహాలు, ఉచిత సేవలకు సంబంధించిన సమాచారాన్ని బాధిత రోగులకు అందించాలన్నారు. అదనపు ప్రాజెక్టు సంచాలకులు కామేశ్వర ప్రసాద్ జిల్లాకు సంబంధించి వివిధ పారామీటర్ల వారీగా నియంత్రణ చర్యల పురోగతిని సిబ్బంది ద్వారా సమీక్షించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సలీం బాషా మాట్లాడుతూ రక్త మార్పిడి, ఇంజెక్షన్ సూదులు, విచ్చలవిడి శృంగారం తదితర వాటి ద్వారా వ్యాధి సంక్రమణకు ఎక్కువ ఆస్కారం ఉందన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో దుర్గారావు దొర, డీసీహెచ్ ఎస్.కార్తిక్, అదనపు డీఎంహెచ్‌వో, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి సీహెచ్‌వీ భరతలక్ష్మి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాంగోపాల్ పాల్గొన్నారు.

బీబీ సకీనాకు కన్నీటి నివాళి



అమలాపురంలో మాతం నిర్వహిస్తున్న ముస్లింలు

అమలాపురం టౌన్: మహ్మద్ ప్రవక్త మనమరాలు బీబీ సకీనా వర్ధంతిని గొల్లగూడెంలోని బీబీ సకీనా పీర్ల పంజా వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు నల్లటి దుస్తులు ధరించి గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్, విశాఖపట్నం, విజయనగరంతో పాటు కోనసీమ జిల్లా నుంచి షియా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉత్తర ప్రదేశ్ నుంచి విచ్చేసిన మత గురువు మౌలానా సయ్యద్ తాహిర్ అబెది మషేద్ది ముస్లింలనుద్దేశించి మత బోధనలు చేశారు. బీబీ సకీనా జీవిత చరిత్రను వివరించారు. చిన్నారి సకీనా సిరియా దేశంలోని బందిఖానాలో పడిన పాట్లు, బలైన తీరును కళ్లకు కట్టినట్లు చెప్పారు. మాతంలో కొందరు రక్తం చిందేలా గుండెలు బాదుకున్నారు.

సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి



గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే కూరను రుచి చూస్తున్న పానుగంటి, శిరీష్

- వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి
- నరేంద్రపురం గురుకులం పరిశీలన

పి.గన్నవరం: ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం ఇకనైనా బుద్ధి తెచ్చుకుని సంక్షేమ హాస్టళ్ల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య డిమాండ్ చేశారు. ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మిండగుదటి శిరీష్ ఆధ్వర్యంలో ఆయన బుధవారం పి.గన్నవరం మండలం నరేంద్రపురం గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సంక్షేమ హాస్టళ్ల బాట కార్యక్రమంతో సంబంధిత శాఖల అధికారుల్లో కాస్తంత కదలిక వచ్చిందన్నారు. విద్యార్థి నాయకుల రాకముందే హాస్టళ్లలో పారిశుధ్య మెరుగుకు చర్యలు చేపడుతున్నారన్నారు. దీనికి నరేంద్రపురం గురుకుల వసతి గృహంలో అత్యవసరంగా చేపట్టిన శుభ్రత – పరిశుభ్రత కార్యక్రమమే నిదర్శనమన్నారు. తాము గురుకులాన్ని సందర్శించిన సమయంలో అక్కడ క్షీణించిన పారిశుధ్యం మెరుగుకు అధికారులు, సిబ్బంది ప్రయత్నిస్తూ దర్శనమిచ్చారన్నారు. స్టూడెంట్స్ యూనియన్ నాయకులు వస్తున్నారని తెలిసి, తూతూమంత్రంగా వంటగది, పాత్రలు శుభ్రం చేశారని కొందరు విద్యార్థులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. నిరంతరం పారిశుధ్య చర్యలు కొనసాగాలని, విద్యార్థులకు మంచి ఆహారం అందించాలని, మౌలిక సదుపాయాల కల్పనపై శ్రద్ధ పెట్టాలని పానుగంటి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్, రీజనల్ కో ఆర్డినేటర్ రమేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి సహదేవ్, రాజోలు అధ్యక్షుడు నవీన్, కొత్తపేట అధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు కరుణ సాయి, అర్జున్, అమర్, సుజిత్, పి.గన్నవరం మండల అధ్యక్షుడు సురేష్, ఐనవోలు మండల అధ్యక్షుడు రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

అర్బన్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఆచార్యులు


ఆర్‌కే ఆచార్యులు

కొత్తపేట: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని వివిధ అర్బన్ డెవలప్‌మెంట్స్‌కు స్టాండింగ్ కౌన్సిల్‌గా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన హైకోర్టు న్యాయవాది రామోజు నాగ వెంకట సత్య కామాచార్యులు (ఆర్‌కే ఆచార్యులు) నియమితులయ్యారు. ఆ మేరకు సెక్రటరీ లీగల్ అండ్ లెజిస్లేటివ్ ఎఫైర్స్ అండ్ జస్టిస్ జి.ప్రతిభాదేవి జారీ చేసిన నియామక ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ అందజేశారని ఆచార్యులు బుధవారం విలేకరులకు తెలిపారు. రాజమహేంద్రవరం, కాకినాడ, ఏలూరు, అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు సంబంధించిన ఫిర్యాదులపై ప్రభుత్వం తరఫున స్టాండింగ్ కౌన్సిల్‌గా వ్యవహరిస్తానని తెలిపారు.

నకిలీ పీఎఫ్ చలానాలపై విచారణకు ఆదేశం

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఇటీవల శానిటరీ కాంట్రాక్టర్ నకిలీ పీఎఫ్ చలానాలు ఇచ్చినట్టు వచ్చిన ఆరోపణలపై శాఖాపరమైన విచారణకు దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రాజమహేంద్రవరం ఆర్‌జేసీ వి.త్రినాథరావును విచారణ అధికారిగా నియమించారు. ఆయన ఆగస్టు ఆరో తేదీన అన్నవరం దేవస్థానికి వచ్చి విచారణ చేయనున్నారు.

ఐదుగురి అరెస్ట్

సీతానగరం: మండలంలోని నల్గొండ శివారున గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురిని అరెస్టు చేశామని నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. సీతానగరం పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్గొండ శివారున ఉన్న మామిడి తోటల్లో అదే గ్రామానికి చెందిన చింతల గంగరాజు, బండారు అప్పన్న దొర, తొర్రేడుకు చెందిన తాటిపాక గణేష్, మురముండకు చెందిన నేరుమిల్లి అఖిల్, బొబ్బిల్లంకకు చెందిన పోలీన సాయి సతీష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 2.57 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీఆర్వో సమక్షంలో ఐదు ప్యాకెట్లలో ఉన్న గంజాయి, మోటారు సైకిల్, రూ.1,500 సీజ్ చేశారు. ఒడిశాలోని ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి, ఇక్కడకు తీసుకువచ్చి చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించడంతో సెంట్రల్ జైలుకు తరలించారు.

సహానానికి పరీక్ష

- పదో తరగతి విద్యార్థుల అయోమయం
- తెలుగు మీడియంలో పరీక్ష రాసే విషయంపై స్పష్టత కరవు
- గతేడాది అవకాశం
- ఈసారి ఇస్తారో, లేదో?


ప్రత్యేక తరగతులకు హాజరైన పదో తరగతి విద్యార్థులు

రాయవరం: పదో తరగతి అనేది విద్యార్థులకు అత్యంత కీలకమైన దశ. ఇక్కడ సాధించిన మార్కులే వారి ఉన్నత చదువులకు, మంచి ఉద్యోగాలు సాధించడానికి ఉపయోగపడతాయి. పాఠశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. అయితే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు తెలుగు, ఇంగ్లిషు మీడియాల్లో రాసుకోవచ్చా అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఎందుకంటే కొందరు విద్యార్థులకు ఇంగ్లిషులో రాయాలంటే బెరకుగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రెండు మాధ్యమాల్లో పరీక్షలు రాసుకునే అవకాశాన్ని ఇస్తే బాగుంటుందని విద్యావేత్తలు చెబుతున్నారు.

రెండు నెలలైనా..

నూతన విద్యా సంవత్సరం జూన్ 12వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఇప్పటికి దాదాపు రెండు నెలలు పూర్తి కావస్తోంది. అలాగే విద్యార్థులకు ఆగస్టు 4వ తేదీ నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు కూడా ప్రారంభం కానున్నాయి. అయితే ఇప్పుడు పది పరీక్షలు ఇంగ్లిషు మీడియంతో పాటు, తెలుగు మాధ్యమంలో నిర్వహిస్తారా, లేదా అనే ప్రశ్న సర్వత్రా వ్యక్తమవుతోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటుగా, తల్లిదండ్రులకు వచ్చిన ఈ ప్రశ్నకు సమాధానం కరవవుతోంది. గత విద్యా సంవత్సరంలో జరిగిన పది పబ్లిక్ పరీక్షల్లో తెలుగులో రాసుకునే వెసులుబాటును ప్రభుత్వ పరీక్షల విభాగం కల్పించింది. ఈ విధంగా గత విద్యా సంవత్సరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 211 మంది రెగ్యులర్ విద్యార్థులు, 15 మంది ప్రైవేటు విద్యార్థులు తెలుగు మీడియంలో పరీక్షలు రాశారు.

వీడని ఉత్కంఠ

ప్రస్తుత విద్యా సంవత్సరంలో కూడా పది పరీక్షలను తెలుగు మీడియంలో రాసుకునే వెసులుబాటు **కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నందున స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. పాఠ్య పుస్తకాలను బైలింగ్విల్ విధానంలో ఉన్న విషయం అందరికీ తెలిసిందే. బోధన రెండు భాష**ల్లోనూ వివరిస్తుండగా, పరీక్షలు మాత్రం ఇంగ్లిషు మీడియంలోనే రాయాల్సిన పరిస్థితి ఉంది. ఈ స్థితిలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తెలుగు మీడియంలో పరీక్షలకు అవకాశం కల్పిస్తారా, లేదా అనే ప్రశ్న వేధిస్తోంది. ప్రధానంగా పదో తరగతి విద్యార్థులు ఈ విషయమై ఉత్కంఠను ఎదుర్కొంటున్నారు.

జిల్లాల వారీగా..

ప్రస్తుతం కోనసీమ జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో 19,850 మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్నారు. ప్రభుత్వ పరీక్షల విభాగం అక్టోబర్ చివరి వారంలో పరీక్ష ఫీజు కట్టించుకునేందుకు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది. ఈలోగా ఈ సంఖ్య కొంతమేర పెరిగే అవకాశం ఉంటుంది. వీటిలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 12,923 మంది విద్యాభ్యాసం చేస్తుండగా, 6,927 మంది విద్యార్థులు ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 26,898 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతుండగా, వారిలో ప్రభుత్వ పాఠశాలల్లో 13,600 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 13,298 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 30,441 మంది విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో 18,463 మంది, ప్రైవేటు స్కూళ్లలో 11,978 మంది చదువుతున్నారు.

స్పష్టత ఇస్తారా..

గతేడాది చివరి క్షణంలో తెలుగు మీడియంలో పరీక్షలు రాసుకోవచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం తెలిపింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో గతంలో మాదిరిగా చివరి క్షణాల్లో చెప్పకుండా ముందుగానే స్పష్టత ఇస్తే ప్రయోజనకరంగా ఉంటుందని వారు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయుల దృష్టికి తీసుకువస్తుండడంతో ఏమి చెప్పాలో వారికి కూడా తెలియని పరిస్థితి. ప్రభుత్వ పరీక్షల విభాగం ఈ విషయంలో స్పష్టత ఇచ్చి ఉత్కంఠకు ముగింపు పలకాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

రెండు మాధ్యమాల్లో అవకాశమివ్వాలి



పదో తరగతి విద్యార్థులు తెలుగు, ఇంగ్లిషు మీడియాల్లో పబ్లిక్ పరీక్షలు రాసుకునేందుకు అవకాశమివ్వాలి. ఇంగ్లిషు మీడియంలో రాయడానికి కొందరు విద్యార్థులు భయపడుతున్నారు. వారి ఇష్టానికి ప్రాధాన్యమివ్వాలి.

– పి.సురేంద్రకుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ముందుగానే ప్రకటించాలి



ఆగస్టులో సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ముందుగానే పది పరీక్షల నిర్వహణపై స్పష్టత ఇవ్వాలి. ప్రభుత్వం ఈ విషయంలో చొరవ చూపించాలి. తెలుగు, ఇంగ్లిషు మీడియంలో విద్యార్థులు పరీక్షలు రాసుకునేలా అవకాశమివ్వాలి.

– ఎస్ఎస్ పల్లంరాజు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ఉత్తర్వులు రావాలి



గత విద్యా సంవత్సరం మాదిరిగా రెండు మీడియాల్లో పదో తరగతి పరీక్షలు రాసుకునే వెసులుబాటుపై ప్రభుత్వ పరీక్షల విభాగం నుంచి ఉత్తర్వులు రావాలి. అవి వస్తేనే విద్యార్థులకు ఆ అవకాశం ఉంటుంది.

– బి.హనుమంతరావు, అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల విభాగం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

బడ్డీకొట్టు తొలగించేందుకు టీడీపీ నేత కుట్ర

- పంచాయతీ సిబ్బంది, పోలీసుల హడావుడి
- ఆత్మహత్యాయత్నం చేసిన బాధితుడు
- వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు కావడంతో టార్గెట్


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్దిరాజు

నల్లజర్ల: కూటమి అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై మొదలైన వేధింపుల పర్వం ఇంకా కొనసాగుతూనే ఉంది. అధికారాన్ని అడ్డుగా పెట్టుకుని గ్రామాల్లో సైతం పేదలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. దూబచర్లలో బుధవారం జరిగిన ఈ ఘటన దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. డైట్ కళాశాలకు వెళ్లే దారిలో దొబ్బిడి పెద్దిరాజు సుమారు 15 ఏళ్లుగా పాన్‌షాపు పెట్టుకుని, అక్కడే కొబ్బరి బొండాలు విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే బుధవారం పంచాయతీ కార్యదర్శి తమ సిబ్బంది, పోలీసులతో వచ్చి ఆ బడ్డీకొట్టు తొలగించాలంటూ హంగామా చేశారు. దీంతో తమ జీవనాధారం పోతుందనే మనస్తాపంతో పెద్దిరాజు పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని తొలుత నల్లజర్ల తర్వాత మెరుగైన చికిత్స కోసం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై పెద్దిరాజు భార్య రాణి మాట్లాడుతూ తాము వైఎస్సార్ సీపీ సానుభూతిపరులమని తమ కొట్టు ఖాళీ చేయించడానికి కూటమి నాయకులు కుట్ర పన్నారన్నారు. ఆరు నెలల క్రితం టీడీపీ నాయకుడు తమ బడ్డీ వెనుక షాపు పెట్టారని, దానికి తమ బడ్డీ అడ్డుగా ఉందని తొలగించడం కోసం పంచాయతీ, పోలీసు సిబ్బందితో ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రహదారి పక్కనే ఉన్న ఆక్రమణలను తొలగించాలనుకుంటే గ్రామంలో అన్ని దుకాణాలను తీసివేయాలన్నారు. అంతేగానీ తమపై కక్ష కట్టి, కేవలం తమ బడ్డీకొట్టునే టార్గెట్ చేశారని ఆరోపించారు. దీనిపై గ్రామ కార్యదర్శి ఆషాలేఖ్యను వివరణ కోరగా ఆ రహదారిలో వెళ్లే లారీలకు ఆ బడ్డీకొట్టుపై ఉన్న చెట్టు కొమ్మలు అడ్డంకిగా ఉన్నాయన్నారు. వాటిని తొలగించాలని పలుమార్లు వారికి చెప్పిన వినకపోవడంతో, ఆ కొమ్మలు తొలగించడానికి మాత్రమే వెళ్లామని వివరణ ఇచ్చారు.

వానపల్లిలో క్షుద్ర పూజల కలకలం!

- ఒక ఇంట్లో 30 అడుగుల లోతు గొయ్యి
- గ్రామస్తుల భయాందోళన
- ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


వానపల్లిలోని ఒక ఇంట్లో తవ్విన గొయ్యి

కొత్తపేట: వానపల్లి గ్రామంలోని ఒక ఇంట్లో క్షుద్ర పూజలు చేస్తున్నారన్న వదంతులపై కలకలం రేగింది. స్థానికుల ఫిర్యాదు మేరకు ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. వానపల్లి గాంధీ బొమ్మ సెంటర్‌లో నలుగురు అన్నదమ్ములకు చెందిన ఇల్లు ఉంది. ప్రస్తుతం ఆ ఇంట్లో నలుగురిలో పెద్దాయన కుమారుడు ఒక్కడే ఉంటున్నాడు. అతడికి వివాహం కాలేదు. కాగా.. నాలుగు రోజులుగా ఆ ఇంట్లో రహస్యంగా పూజలు నిర్వహిస్తున్నట్టు సమీపంలోని ప్రజలు గమనించారు. ఆ నోటా ఈ నోటా గ్రామమంతా ప్రచారం జరిగింది. దీంతో బుధవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామ వీఆర్వో లంక వెంకట నాగరాజు, పోలీసు కానిస్టేబుల్ అక్కడికి చేరుకున్న అనంతరం గ్రామస్తులు మూకుమ్మడిగా ఆ ఇంటిని చుట్టుముట్టి లోపలకు ప్రవేశించారు. అక్కడ ఒక గదిలో సుమారు మీటరు నలుచదరంలో సుమారు 30 అడుగుల లోతు గొయ్యి తవ్వి ఉంది. దానిలో పూజా సామగ్రితో పాటు, దిగటానికి నిచ్చెన, తాడు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో అక్కడ ఉన్న వ్యక్తులను ఇదేమిటని గ్రామస్తులు నిలదీశారు. దానితో ఆ ఇంటికి చెందిన వ్యక్తి మొదట బాత్‌రూమ్‌కు తవ్వుతున్నామని, తర్వాత ఎముకలు ఉన్నాయని, తవ్వి తీసేయమని సిద్ధాంతి చెప్పారని అన్నాడు. ఎముకలు ఎక్కడ అని ప్రశ్నించగా, బయట పారేశామన్నారు. రంపచోడవరం, రాజమహేంద్రవరం నుంచి నలుగురిని తీసుకువచ్చి, ఈ గొయ్యి తవ్వినట్టు తెలుస్తోంది. అమలాపురానికి చెందిన ఒక వ్యక్తితో అక్కడి పూజ చేయిస్తున్నట్టు సమాచారం. దీనితో ఆరుగురిని అదుపులోకి తీసుకుని కొత్తపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై ఎస్సై జి.సురేంద్రను 'సాక్షి' వివరణ కోరగా క్షుద్ర పూజలు నిర్వహిస్తున్నారన్న స్థానికుల అనుమానంతో పిర్యాదు చేశారని, విచారణ చేయాల్సి ఉందన్నారు.

కటకటాల్లోకి కీచక కరస్పాండెంట్

- రామచంద్రపురం మండలం కొత్తూరులో అరెస్టు
- వివరాలు వెల్లడించిన ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి


విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి

రాయవరం: మాచవరంలో బాలిక (విద్యార్థిని)ను గర్భవతిని చేసిన ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ ఆకుమర్తి జయరాజును బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. రాయవరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి ఆ వివరాలు వెల్లడించారు. మాచవరంలో మార్గదర్శి ఇంగ్లిషు మీడియం పాఠశాలను ఆకుమర్తి జయరాజు కరస్పాండెంట్‌గా ఉంటూ నిర్వహిస్తున్నాడు. ఇదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలికపై కన్నేశాడు. ఈ ఏడాది మార్చి 26న ఆ బాలికను పాఠశాలలో తన ఆఫీసు రూమ్‌కు రప్పించుకుని అల్మరాలో ఉన్న ఫైల్స్ తీయాలని ఆదేశించాడు. బాలిక ఆ ఫైల్స్ తీస్తుండగా జయరాజు వెనుక నుంచి గట్టిగా పట్టుకోవడంతో బాలిక కేకలు వేసింది. దీంతో ఆమె నోరు నొక్కి, చంపేస్తానని బెదిరించి, అత్యాచారం చేశాడు. కాగా.. బాలిక శరీరంలో వస్తున్న మార్పులు గమనించిన తల్లిదండ్రులు ఆస్పత్రిలో పరీక్షలు చేయించగా, ఐదు నెలల గర్భవతి అని తేలింది. బాలిక ద్వారా విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు ఈ నెల 28న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో జయరాజుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడిని రామచంద్రపురం మండలం కొత్తూరు వద్ద అరెస్ట్ చేశారు. అలాగే నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ దొరరాజు, ఎస్సై సురేష్‌బాబులను ఆమె అభినందించారు. విలేకరుల సమావేశంలో మండపేట సీఐ పి.దొరరాజు, ఎస్సై డి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

వాడపల్లిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ


వాడపల్లి క్షేత్రంలో ప్రసాదాల తయారీని పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి క్షేత్రంలో అన్న ప్రసాదం, లడ్డూ, పులిహోర తయారీ, ఆర్వో వాటర్ ప్లాంట్లను బుధవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేశారు. కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రానికి రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇక్కడ భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. అలాగే లడ్డూ, పులిహోర ప్రసాదాలను విక్రయిస్తున్నారు. వాటి నాణ్యతను ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జీఏబీ నందాజీ, జిల్లా ఫుడ్స్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ వై.రామయ్య పరిశీలించారు. తయారీతో పాటు అక్కడ ఉన్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం అనంతరం వారికి వేద ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో దేవదాయ – ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్య చక్రధరరావు పాల్గొన్నారు.

మందుబాబుల జేబుగుల్ల

- హెచ్‌డీ విస్కీ ధర తగ్గిన వైనం
- కానీ పాత రేటుకే అమ్మకాలు
- చాగల్లు కేంద్రంగా అక్రమార్కుల దందా



హెచ్‌డీ విస్కీ బాటిల్ లేబుల్‌పై ముద్రించిన రూ.130 ధర, బాటిల్ పైభాగంలో కనిపించకుండా ఉన్న తగ్గింపు ధర రూ.120 (వృత్తంలో)

చాగల్లు, సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వంలో మందుబాబులను అడ్డంగా దోచుకుంటున్నారు. మద్యం ధరలు తగ్గించినా ఆ విషయాన్ని దాచిపెట్టి మందుబాబుల జేబులు గుల్లచేస్తున్నారు. చాగల్లు కేంద్రంగా జిల్లాలో పలు మండలాల్లోని మద్యం దుకాణాల్లో ఈ దందా జరుగుతోంది. అయినా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నంద్యాల డిస్టలరీ నుంచి హెచ్‌డీ బ్రాండ్‌తో విడుదల అవుతున్న విస్కీతో ఈ మోసం జరుగుతోంది. నంద్యాల డిస్టలరీ నుంచి తూర్పుగోదావరి జిల్లాలోని చాగల్లు డిపోకు వస్తున్న ఈ హెచ్‌డీ విస్కీని డీలర్లు అయిన కాడికి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. అందుకోసమే పెద్దగా ఆదరణ లేని హెచ్‌డీ విస్కీని ఒకే సారి కేసులకు కేసులు డీలర్లు కొనుగోలు చేస్తున్నారు. రూ.130 ఉన్న హెచ్‌డీ బ్రాండ్ విస్కీ బాటిల్ ఇటీవల రూ.120కు తగ్గింది. తగ్గిన ధర ప్రకారం బాటిల్‌పై ఎంఆర్‌పీ రూ.120గా ముద్రించాలి. కానీ ధర తగ్గినప్పటికీ బాటిల్‌పై లేబుల్‌లో మాత్రం ఇప్పటికీ ఎంఆర్‌పీ రూ.130గా ఉంటోంది. తగ్గిన ఎంఆర్‌పీకి అనుగుణంగా డిపో నుంచి హెచ్‌డీ బ్రాండ్ విస్కీని రూ.100కే డీలర్లకు సరఫరా చేయాలి. దాన్ని డీలర్ రూ.120కి విక్రయించాలి. అయితే డిపో నుంచి డీలర్లకు రూ.100కే లభిస్తున్నా మందుబాబులకు మాత్రం రూ.130కు విక్రయిస్తున్నారు. పాత లేబుల్ రూ.130తోనే హెచ్‌డీ విస్కీ బాటిళ్లను విక్రయిస్తున్న విషయం తెలిసినా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చూసీ చూడనట్టు వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ఈ బ్రాండ్‌కు పెద్దగా ఆదరణ లేకపోవడంతో అమ్మకాలు కూడా పెద్దగా ఉండవు. డిపో నుంచి రోజూ 30 నుంచి 40 కేసులు మాత్రమే వెళుతుంటాయి. ఇప్పుడు ఒకే రోజు 3,500 కేసులు మార్కెట్‌లోకి వెళ్లినట్టు తెలుస్తోంది. చాగల్లు డిపో పరిధిలోని కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు, జంగారెడ్డిగూడెం తదితర మండలాల్లోని సుమారు 105 షాపులలో సగానికి పైగా షాపులకు హెచ్‌డీ బాటిళ్ల సరఫరా చేశారు.

భార్యను చంపిన భర్త అరెస్టు


విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

రాజానగరం: కట్టుకున్న భార్యను నాపరాయితో కొట్టి హతమార్చిన భర్తను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించామని రాజమహేంద్రవరం నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆ ప్రకారం.. రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు శివారు సంతోష్ నగర్‌లో నివాసం ఉంటున్న నల్లమాటి లక్ష్మి పెద్ద కుమార్తె ఉషారాణికి నర్సీపట్నం సమీపంలోని గిడుతూరుకు చెందిన వేమగిరి మాణిక్యంతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వివాహం అనంతరం ఉపాధి కోసం అత్తింటికి వచ్చిన మాణిక్యం సంతోష్ నగర్‌లోనే వేరొక ఇంటిలో ఉంటూ వెల్డింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే భార్యపై అనుమానం పెంచుకుని, తరచూ గొడవ పడేవాడు. నెల రోజుల క్రితం ఇదే విషయమై రాజానగరం పోలీసులకు ఉషారాణి ఫిర్యాదు చేసింది. అయినా అతడిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో ఈ నెల 26 రాత్రి 11.30 గంటల సమయంలో భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగింది. దీంతో మాణిక్యం తన భార్య తలపై నాపరాయితో కొట్టి పరారయ్యాడు. గమనించిన చుట్టుపక్కలవారు ఈ విషయాన్ని అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆమె తల్లి నల్లమాటి లక్ష్మికి సమాచారం ఇవ్వడంతో రక్తపు మడుగులో ఉన్న ఉషారాణిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లింది. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 12.40 గంటలకు చనిపోయింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాణిక్యాన్ని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కి పంపించారని డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ వీరయ్యగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని స్కూటరిస్టు మృతి

రాజానగరం: కొంతమూరులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. లారీ చక్రాల మధ్య ఇరుక్కుపోయిన అతడి శరీరం ఆనవాలు కట్టేందుకు కూడా అవకాశం లేనంతగా నుజ్జునుజ్జయింది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ఎస్.ప్రియ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరంలోని కోటిలింగాలపేటకు చెందిన బత్తుల చిట్టిరాజు (52) గుమ్మలదొడ్డిలోని పీఎంపీజె ఇండస్ట్రీస్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రతి రోజూ మాదిరిగానే బుధవారం ఉదయం 8 గంటలకు స్కూటర్‌పై ఇంటి నుంచి బయలు దేరాడు. సుమారు 8.30 గంటలకు కొంతమూరు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ అతడి బైకును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైకుపై నుంచి ఎగిరిపడి లారీ వెనుక చక్రాల మధ్య పడటంతో అతడి శరీరం గుర్తు పట్టేందుకు కూడా వీలులేనంతగా నుజ్జునుజ్జయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.


భవనం పైనుంచి పడి పెయింటర్ మృతి

సీతానగరం: భవనానికి రంగులు వేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తూ కింద పడి మృతి చెందాడు. చినకొండేపూడిలో బుధవారం ఈ విషాద ఘటన జరిగింది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. వంగలపూడికి చెందిన అల్లం సతీష్ జ్ఞాన కుమార్ (46) భవనాలకు రంగులు వేస్తుంటాడు. ఈ నేపథ్యంలో బుధవారం చినకొండేపూడిలోని అడపా తిరుపతిరావు ఇంటి పైఅంతస్తుకు పరంజీ కట్టుకుని, దానిపై నిలబడి రంగు వేస్తున్నాడు. ప్రమాదవశాత్తూ పరంజీ తాడు తెగిపోవడంతో పైనుంచి రోడ్డుపై పడ్డాడు. తలకు తీవ్ర గాయమైన అతడిని తోటి కార్మికుడు బస్టాండ్ సెంటర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించాడు. అప్పటికే సతీష్ మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య దేవీ భవాని, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి..

జగ్గంపేట: ప్రమాదవశాత్తూ కాలు జారి చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడని జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు. జగ్గంపేటకు చెందిన డేవిడ్ రాజు (44) పంచాయతీలో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం 12.30 సమయంలో మంచినీటి చెరువులో ప్రమాదవశాత్తూ జారి పడిపోయినట్టు మృతి చెందాడు. అతడి తల్లి ఎల్లె రత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,000
గటగట (వెయ్యి)	24,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

పత్రికా ప్రకటన

జి.ఓ.ఎమ్.ఎస్.నెం.131, తేది : 25.07.2025గా గల మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్, ఆంధ్రప్రదేశ్ మరియు Lr.Roc.No.19022(31)/35/2022-RJDR, తేది:29.07.2025గా గల డైరెక్టర్ ఆఫ్ టౌన్ & కంట్రీప్లానింగ్, మంగళగిరి, ఆంధ్రప్రదేశ్ వారి ఉత్తర్వులు ననుసరించి ప్రభుత్వం వారి అన్ని ప్రజా సేవలు అనగా భవన నిర్మాణాలు, లే ఔట్ ప్లాన్ అనుమతులు, పారిశుధ్య పనుల పర్యవేక్షణ మౌలిక సదుపాయాలు ఆన్లైన్ ద్వారా ప్రజలకు సమకూర్చుటకు జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జి.ఐ.యస్) ఉపయోగించుకుని ప్లానులను తయారు చేసుకొని ప్రభుత్వం వారితో ఆమోదింపచేసుకొన్నచో ప్రజలకు ఖచ్చితత్వముతో కూడిన సేవలు లభించుటకు వీలగునని, మండపేట పురపాలక సంఘ జి.ఐ.యస్. ఆధారిత మాస్టర్‌ప్లాన్ తయారుచేసి ప్రభుత్వంవారికి ఆమోదం నిమిత్తం సమర్పించవలసిందిగా తెలియజేసియున్నారు.

అందుపై ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ రూల్స్ 2017 మరియు ఆంధ్రప్రదేశ్ లాండ్ డెవలప్మెంట్ (లే ఔట్ మరియు సబ్ డివిజన్) రూల్స్ కు లోబడి సదరు ముసాయిదా జనరల్ టౌన్ ప్లానింగ్ స్కీమ్ మాప్-1 మరియు మాప్-2 భవిష్యత్తులో 20 సంవత్సరములు వరకు అమలు పరచుటకు సదరు ముసాయిదా జనరల్ టౌన్ ప్లానింగ్ స్కీమ్ మాప్-1 మరియు మాప్-2 ను మండపేట పట్టణ ప్రణాళిక విభాగంలో ప్రచురిస్తూ, సదరు ప్లాన్ పై ప్రజలకు ఎటువంటి అభ్యంతరములు మరియు సూచనలు ఉన్నయెడల మున్సిపల్‌కమిషనర్, మండపేటవారికి 60రోజులు లోపుగా వ్రాతపూర్వకముగా సమర్పించినట్లయితే వాటిని ప్రభుత్వంవారికి సమర్పించబడునని గుణముగా జనరల్ టౌన్ ప్లానింగ్ స్కీమ్ (మాస్టర్ ప్లాన్) పై ఫైనల్ నోటిఫికేషన్ ప్రభుత్వంవారు రిలీజుచేయుదురని మండపేట పట్టణ ప్రజలకు తెలియజేయడమైనది.

కమీషనరు, మండపేట పురపాలక సంఘం.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

LAND FOR SALE

■ పిఠాపురం మండలం విరవ గ్రామం సర్వే నెంబరు 87/2బిలోని రెండు ఎకరాల (9680 చ॥గ॥) భూమి అమ్మకమునకు కలదు. (డైరెక్ట్ పార్టీలు మాత్రమే) ✆ : 9100812122 [R-1054]

Wanted

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406 [HA-16111]

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959021122, 9949021122 [B-1275595]

కావలెను

ఆదిత్య యూనివర్శిటీ

సూరంపాలెంలో పనిచేయుటకు

అసిస్టెంట్ చీఫ్ వార్డెన్స్, వార్డెన్స్

(MALE / FEMALE)

- ఏదైనా డిగ్రీ విద్యార్హతతో పాటు కంప్యూటర్ నాలెడ్జ్ కలిగి ఉండవలెను.
- మంచి తెలుగు, ఇంగ్లీషు మరియు హిందీ కమ్యూనికేషన్ స్కిల్ కలిగి ఉండవలెను.
- ఉచిత భోజన, వసతి సదుపాయం

మరిన్ని వివరములకు సంప్రదించవలసిన నెంబర్లు:

70361 76661, 90100 26664

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.